# దేవుడింకా ఉన్నాడు!

ఇటీవల నేను మా స్వగ్రామం వెళ్ళాను. నాకు అయినవాళ్ళంతా అక్కడే ఉన్నారు. వాళ్ళని చూసి పదేళ్ళయినది. నేను జంధ్యాలు తెంపేసి తద్దినాలు మానేసి, ఏనాడయితే వితంతువును అందులో మరో శాఖదాన్ని పెళ్ళాడానో ఆనాడే నాకు మా బంధువులకు ఋణం తీరిపోయింది. నేను మా ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోతున్నానన్నప్పుడు అందరూ సంతోషించారు. నా ప్రయాణానికి ముహూర్తాలు పెట్టారు. "ఎప్పుడు వెళ్ళటం?" అని ఒకటికి పదిసార్లు అడిగారు. "ఇంకా పోలేదా?" అని కూడా అడిగారు. అయిపోయింది. నేను ఊరు విడిచి వచ్చేశాను. వాళ్ళకోరిక ఫలించిందని నేనూ సంతోషించాను.

కాని వారికి సంతృప్తి కలిగినట్టు లేదు. నేను వాళ్ళ మొహం చూడకుండా పదేళ్ళ గడపగలగటం వారు సహించలేకపోయినారు. నాకు బంధువుల మీద ప్రేమే లేదన్నారు. ఎవరు బ్రతికున్నారో ఎవరు చచ్చారో కూడా నేను పట్టించుకోవటం లేదన్నారు. నాకు నిష్ఠురపు ఉత్తరాలు రాశారు. చివరకు నేను మోసపోయినాను. వాళ్ళంతా కాలంతోపాటు మారారనుకున్నాను. నిజంగా సంతసిస్తున్నారని నమ్మాను. వెళ్ళాను.

అరుగుమీద చాపేసి కూర్చోబెట్టారు నన్ను. ఊళ్ళో ఉన్న బంధువులంతా చేరారు. మామూలు కుశలప్రశ్నలు వేశారు. సమాధానం చెప్పాను. సంభాషణ ఆగిపోయింది.

అందరి మొహాలకేసి చూశాను. ఎవరి మొహాన ఒక సంతోషంగాని విచారం గాని లేదు.

అకస్మాత్తుగా నిశ్శబ్దం భంగమయింది.

"చావు వెధవా!" అని మా పెద్ద వొదినెగారు తన ఆఖరు కొడుకును వెడిమని వీపు మీద ఒక్కటి చరిచింది. వాడు జోకా పట్టాడు. వాడి మెళ్ళో రెండు తాయిత్తులూ, మొలకు మరొక తాయెత్తు కనిపించింది. పిల్లవాడు చాలా అనారోగ్యంగా ఉన్నాడు. పొట్ట పెరిగింది. రొమ్ము ఎండుకుపోయింది. కాళ్ళు పుడకలల్లే ఉన్నాయి. తల పెద్దదిగా కనిపిస్తున్నది.

"పిల్లవాడట్లా ఉన్నాడే వదినా?" అన్నాను.

"నేను చేసుకున్న రాత!" అన్నదావిడ.

"ఏమన్నా మందిప్పిస్తున్నారా?"

మా చిన తాతయ్యా దగ్గాడో, లేక నవ్వాడో, ఆ రెండు చప్పుళ్ళు ఆయన ఒకటిగానే చేస్తాడు.

"భైరవ శాస్త్రుల్లూ....నవగ్రహ జపం చేసి.... తాయెత్తు కట్టాళ్ళే" అన్నాడాయన సావధానంగా.

విషయం మార్చటానికని "ఇక్కడ ఈ ఇటికల పోగేమిటి?" అన్నాను.

"చూడలేదుట్రా? మేడమీద దక్షిణవేపు గది విప్పించేశాం?" అన్నాడు మా పెదనాన్న.

"ఏం" అన్నాను ఆశ్చర్యంగా. ఆ దిక్కుమాలిన మేడకల్లా అదొక్కటే సుఖమైన గది.

"అందులో తాతయ్య ఉన్నాడు కాదు మరీ?" అన్నాడు పెదనాన్న.

తాతయ్య ఉండటమంటే మీ కర్థంకాదు. మా తాత చచ్చిపోయి దయ్యమై ఆ గదిలో ఉంటున్నాడు. మరే గదిలోకి తాతయ్య రాడు.

"భైరవ శాస్త్రులు చేత ముగ్గులూ అవీ వేయించాం. లాభించలేదు. తాతయ్యకు భేతాళ మంత్రం వచ్చును కాదు మరీ? భైరవ శాస్త్రులు ముగ్గులు పని చెయ్యలేదు మారణహోమం చేస్తానన్నాడు భైరవ శాస్త్రుల్లు. బ్రహ్మహత్య దేనికని మేమంతా వారించాం" అన్నాడు పెదనాన్న.

చిన తాత దగ్గాడో లేక నవ్వాడో.

"ఎందుకూ? గది పడగొట్టేస్తే.... ఆయన వెళ్ళిపోతాడు .... ఆ గదిలో అన్నయ్య ఏమన్నా నిక్షేపం దాచాడా.... లేకపోతే ఆ గదిని విడిచి ఎందుకుపోడూ? అని నాకు సందేహం కలిగింది. సగం అందుకే నేను పట్టుబట్టి గది పడగొట్టించేశా" అన్నాడాయన.

"అన్నీ అనర్థాలుగానే ఉన్నవి కొంపకు. (గొంతు తగ్గించి) సత్యం పెళ్ళాం మళ్ళీ లేచిపోయింది. గుర్రబ్బండి వాడితో—".

సత్యమంటే మా రెండో అన్న. నేను మా వూరు వదిలినాక వాడి భార్య పోయింది. రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఈవిడ అదివరకొకసారి లేచిపోయిందని నాకు తెలీదు.

"ఇదంతా సత్యం మొదటి భార్య పనే! బాలింత చావుకూడా చచ్చింద్గా? వ్వానా ఏడుపులూ ఏడిపిస్తున్నది! సత్యానికి నెలకో సారైనా కనిపించి, నీ క్షాపర్రం స్తాగనిస్తాననుకున్నావా, అని బెదిరిస్తూ వుంటుంది. అది లేచిపోయిందంటే పోదూ? దీనికి నలుగురు పిల్లలు పుట్టారా? మూడోవాడుతప్ప మిగిలినవాళ్ళంతా పోయినారు. అందర్నీ పొట్టన బెట్టుకుంది" అన్నాడు పెదనాన్న.

"మూడోవాణ్ని వదిలిందేం?" అన్నాను.

"ఏం వదిలింది? వాడికి అన్నీ మోరాలే! డాక్టర్ను వద్దు అంటున్న కొద్దీ మీ పెద్ద అన్న పిలిచాడు. వాళ్ళ మొహం! డాక్టర్లేం చెబుతారు? తల్లికి సవాయి

రోగం ఉందన్నాడు. నిక్షేపమైన బ్రాహ్మణ కుటుంబంలో సవాయిఏమిటి వాడి శ్రాద్ధం? భైరవ శాస్త్రుల్లును పిలిస్తే అసలు కీలకం ఇట్టే చెప్పాడు. ఇదంతా సత్యం మొదటి పెళ్ళాంపనే!" అన్నాడు పెదనాన్న.

చిన తాతయ్య దగ్గాడు.

"అసలు సత్యానికి గురువులో శనీ! రవి కోణంలో ఉన్నాడు. సప్తమంలో శుక్రుడూ, బుధుడూ ఉన్నారు.... ఇంకా రెండేళ్ళు మూడు నెల్ల పన్నెండు రోజులు. అప్పటికి సత్యానికి మారకమన్నా కావాలీ లేదా మంచి యోగమన్నా పట్టాలి. ఏదో ఒకటి తప్పదు...." అన్నాడు చిన తాతయ్య.

నేనీ మాటలు వింటూండగా మా పెద్దన్న రెండోకూతురు ఎప్పుడో వచ్చి నా జేబులో పెన్నులాగి మోకాలికి పెట్టి రెండుగా విరిచి కాళ్ళమీద సిరా పడ్డందుకు పెద్ద పెట్టున ఏడవసాగింది. మా పెదనాన్న చప్పునలేచి నా కండువాతో దాని కాళ్ళు రెండూ తుడిచాడు.

మా చిన తాత మా సత్యానికి రానున్న మారక యోగం సంగతే ఇంకా ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు. ఆయన నిట్టూర్చి "ఏమో , అన్నింటికీ భగవంతుడు న్నాడు" అన్నాడు.

ప్రచురణ : 1954, సవతితల్లి కథల సంపుటిలో.
దేశి కవితా మండలి, విజయవాడ.